స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం



రేజర్ల చెరువు వద్ద బతుకమ్మ ఘాట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్: రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరేలా చూస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం సీట్లు గెలిచేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సూచించారు. మండలంలోని రేజర్లలో బుధవారం సింగరేణి నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన వ్యవసాయ గోడౌన్, పల్లె దవాఖానా నూతన భవనం, రూ.50 లక్షలతో చెరువు వద్ద నిర్మించిన బతుకమ్మ ఘాట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అదే విధంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బీఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యాన సుబ్బారెడ్డి సమకూర్చిన షూష్, సాక్సులను ఎమ్మెల్యే పంపిణీ చేసి, పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మొదటినుంచి తనకు అండగా ఉన్న రేజర్ల ప్రజలకు, గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉంటానన్నారు. అనంతరం అస్వస్థతకు గురైన రాధమ్మకు ఓఆర్ఎస్ తాగించి బీపీ పరీక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్, ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు, హెచ్ఎం నాగమణి, వెల్ఫేర్ ఆఫీసర్ దేవదాసు, ఏఓ శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు దయానంద్, సుబ్బారెడ్డి, నర్సింహారావు, శ్రీనివాస్, అప్పారావు, ప్రభాకర్ పాల్గొన్నారు.



కొణిజర్ల: అమ్మపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

కొణిజర్ల/కారేపల్లి: స్థానిక సంస్థల సమరానికి కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా సిద్ధంగా ఉండాలని, ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. బుధవారం కొణిజర్ల మండలంలోని అమ్మపాలెం సమీపంలోని ధర్మస్థలిలో, కారేపల్లి వైఎస్ఎస్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీకి బలం, బలగం కార్యకర్తలేనని, మీరంతా కలసికట్టుగా పనిచేసి గెలిచే వ్యక్తులను అభ్యర్థులుగా ఎంపికచేసి మండలంలో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదని నిరూపించాలన్నారు. అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌పార్టీని ఆదరించాలని, కార్యకర్తలు గ్రామ గ్రామాన ప్రచారం చేయాలన్నారు. అదే విధంగా కొణిజర్లలోని.. చిన్నగోపతి మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కాంతమ్మ మృతి చెందడంతో బుధవారం నిర్వహించిన ఆమె దశదిన కర్మకు హాజరై, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మధు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నారాయణరావు, మంజుల, సంతోష్, సౌజన్య, సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు, చంద్రప్రకాశ్, తిరుపతిరావు, టోనీవీరప్రతాప్, రామారావు, రమేష్, శ్రీనివాసరావు, రోశయ్య, పుల్లయ్య సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

వైరాలో డ్రెయిన్లకు మోక్షం



రిజర్వాయర్ రోడ్డులో విద్యుత్ స్తంభాలు తొలగిస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది



వైరా గంధం టవర్స్ ప్రాంతంలో సైడ్ డ్రెయిన్లకు కొలతలు వేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ వేణు

వైరా: గత రెండేళ్లుగా డ్రెయినేజీలు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. గంధం టవర్స్ అపార్ట్‌మెంట్ పరిసరాల్లో డ్రెయినేజీలు లేక మురుగునీరంతం రోడ్లపైకి వచ్చి ఇబ్బందిగా మారింది. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ సీహెచ్.వేణు సమస్యను జిల్లా ఉన్నతాధికారులకు నివేదించగా రూ.24లక్షల నిధులు మంజూరయ్యాయి. దీంతో స్థానిక గంధం టవర్స్ నుంచి పోలీస్ స్టేషన్ సమీపంలోని టీఎస్ ప్రసాద్ కాంప్లెక్స్ వరకు సైడ్ డ్రెయిన్ పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి ఇటికాల భాస్కర్, ఇంజనీరింగ్ అధికారులు రోడ్డు నుంచి కొలతలు వేసి సమీపంలోని వ్యాపారస్తులకు నోటీసులు ఇచ్చారు. రెండు రోజులలో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తామని కమిషనర్ తెలిపారు.

రిజర్వాయర్ రహదారిపై మిడిల్ పోల్స్ తొలగింపు..

స్థానిక క్రాస్‌రోడ్డు నుంచి వైరా రిజర్వాయర్ కుడి కాల్వ వరకు ఉన్న ప్రధాన రహదారిపై ఇప్పటికే సిమెంట్ రోడ్డు నిర్మాణం ఓ వైపు పూర్తి చేశారు. మరో వైపు విద్యుత్ స్తంభాలు ఆటంకంగా ఉండటంతో ఇంజనీరింగ్ అధికారులు పనులు నిలిపివేశారు. మున్సిపాలిటీ నుంచి విద్యుత్ శాఖకు రూ.5 లక్షలు చెల్లించడంతో రోడ్డుకు సమీపంలోని విద్యుత్ పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించే పనులను చేపట్టగా.. విద్యుత్ శాఖ ఏఈ సుందర్‌కుమార్ పనులు పర్యవేక్షిస్తున్నారు.

నానో యూరియాతో అధిక పోషకాలు

మధిర: నానో యూరియా వాడకం వల్ల మొక్కకు అధిక పోషకాలు అందుతాయని జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య తెలిపారు. సిరిపురం గ్రామంలో బుధవారం పత్తి పంటను ఆయన పరిశీలించారు. నానో యూరియా క్షేత్ర ప్రదర్శనలో భాగంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. నానో యూరియా వాడకం వలన ఖర్చు, పర్యావరణ కాలుష్యం తగ్గుతుందని తెలిపారు. దీనిని ఎంపిక చేసుకున్న కలుపు మందుల్లో కలిపి పిచికారి చేయవచ్చునని రైతులకు వివరించారు. అనంతరం మధిర రైతు వేదికలో ఏఈవో, ఏవోలకు ఆయిల్ పామ్ పంట సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్ విజయచంద్ర, మండల వ్యవసాయ అధికారి కె సాయి దీక్షిత్, వ్యవసాయ విస్తరణ అధికారులు వేణు, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన



ఎర్రుపాలెం: ఇందిరమ్మ ఇంటికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

ఎర్రుపాలెం: మండలంలోని వెంకటాపురంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మధిర మార్కెట్ చైర్మన్ బండారు నర్సింహారావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చొరవతో అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరవుతాయని తెలిపారు. కాగా, గ్రామానికి చెందిన కర్నాటి సుధాకర్‌రెడ్డి – సుభాషిణి కుమార్తె మహంతిరెడ్డి ఇటీవల ఫార్మా డీ పూర్తిచేసి ర్యాంకు సాధించడంతో ఆమెను సుధాకర్‌రెడ్డి, నర్సింహారావు తదితరులు సన్మానించారు. ఈకార్యక్రమాల్లో సొసైటీ చైర్మన్ వెన్నపూస కృష్ణారెడ్డి, నాయకులు బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, శీలం వెంకట్రామిరెడ్డి, మేకల రమేష్, బొగ్గుల శ్రీనివాసరెడ్డి, జాన్‌బాషా, బాబురావు, శ్రీను, బాలరాజు, కర్నాటి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొద్దుటూరు గ్రామంలో..

చింతకాని: మండలంలోని పొద్దుటూరు గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్లకు హౌసింగ్ మండల ఏఈ సుప్రియ శంకుస్థాపన చేశారు. లబ్ధిదారులు నిబంధనల ప్రకారం వెంటనే నిర్మాణాలు ప్రారంభించి, నాణ్యతగా నిర్మించుకోవాలని, పలు సూచనలు చేశారు. కాంగ్రెస్ మండల అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రవీంద్రప్రసాద్‌కు ఎంపీడీఓ బాధ్యతలు



ఎంపీడీఓ రవీంద్రప్రసాద్

కారేపల్లి: సింగరేణి ఎంపీఓగా విధులు నిర్వర్తిస్తున్న రవీంద్రప్రసాద్‌కు ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు అప్పగిస్తు బుధవారం ఉత్తర్వులు వచ్చాయి. ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వహించిన సురేందర్.. భూపాల్‌పల్లి జిల్లాకు బదిలీ కాగా, ఆయన స్థానంలో రవీంద్రప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ముదిగొండ ఆర్ఐగా కల్యాణి



ఆర్ఐ కల్యాణి

ముదిగొండ: ముదిగొండ తహసీల్‌లో బుధవారం కల్యాణి ఆర్ఐగా బాధ్యతలు చేపట్టింది. ఇక్కడ పనిచేసిన ఆర్ఐ వహిదా సుల్తానా ఖమ్మం ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ కాగా.. ఆమె స్థానంలో అక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన కల్యాణి బాధ్యతలు స్వీకరించారు.

నివాళి..

పెనుబల్లి: మండల పరిధిలోని చిలుకూరి ప్రమీళా రాణి మంగళవారం రాత్రి మృతి చెందగా బుధవారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దయానంద్ తదితరులు పాల్గొన్నారు.



కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల



విశాలమైన సెమినార్ గది



లైబ్రరీ గది

కార్పొరేట్‌కు దీటుగా కళాశాల

- 2018 నుంచే నూరుశాతం ఉత్తీర్ణత
- కెమిస్ట్రీ, ఫిజిక్స్, బోటని, జువాలజీ విభాగాల్లో ల్యాబ్‌లు
- ప్రత్యేకంగా లైబ్రరీ, సెమినార్ హాల్, క్రీడామైదానం
- ప్రవేశాలకు విద్యార్థుల ఆసక్తి

కల్లూరు: పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించడమే కాకుండా.. దీటుగా విద్యార్థులకు విద్యనందిస్తుంది కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల. కల్లూరు సమితిగా ఉన్నప్పుడు 1967లో కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటైంది. ఎందరో విద్యార్థులను తీర్చిదిద్ది వారి భవిష్యత్‌కు బంగారు బాట వేసింది. అప్పట్లో కల్లూరు కళాశాలలో సీటు దొరకాలంటే పోటీ పడాల్సిందే. రాను రాను విద్యావ్యవస్థ విస్తరించడం, సమితి స్థానాల్లో మండలాలు రావడం, ప్రైవేట్ కళాశాలలు అరగేట్రం చేయడంతో కళాశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది.

ప్రిన్స్‌పాల్ చొరవతో పూర్వ వైభవం..

2012లో కేవలం 22మంది విద్యార్థులకు పరిమితమైంది. ఆ సమయంలో ప్రిన్సిపాల్‌గా వచ్చిన కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ కుతుంబాక శ్రీనివాసరావు చొరవతో కళాశాలకు పూర్వ వైభవం వచ్చింది. విద్యార్థుల సంఖ్యను పెంచడమే కాకుండా.. శిథిలమైన భవనాలను పరిశీలించి నూతన నిర్మాణాలకు కృషి చేశారు. అప్పటి ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన తుమ్మల 2013లో రూ.3కోట్లు నాబార్డ్ నిధుల మంజూరు చేయగా.. 2016లో కళాశాల భవనం ప్రారంభమైంది.

సకల సౌకర్యాలతో కళాశాల..

నూతన భవనం మంజూరు కావడంతో విశాలమైన తరగతి గదులు, అన్ని విభాగాల్లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటని, జువాలజీ సబ్జెక్టలకు ల్యాబ్‌లు, ప్రత్యేకించి సెమినార్ గది, లైబ్రరీ, క్రీడామైదానం, పచ్చదనంతో కూడిన వృక్షాలతో కళాశాల వాతావరణం అహ్లాదకరంగా సకల సౌకర్యలతో ఉంది.

నాణ్యమైన విద్యాబోధన ..

కళాశాలలో ప్రస్తుతం ఉన్న 18మంది అధ్యాపకులు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నారు. 2018 నుంచి 2025వ విద్యా సంవత్సరం వరకు నూరుశాతం ఉత్తీర్ణత సాధిస్తుంది కళాశాల. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావుతో పాటు అధ్యాపకులు కల్లూరు పరిసర ప్రాంతాల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు కళాశాల ప్రయోజనాలు, విద్యాతీరును వివరించి సంఖ్యను పెంచారు. 2024–25 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 86మంది, ద్వితీయ సంవత్సరంలో 66మంది విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం..



కళాశాలలో ఎక్కువశాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వారికి నాణ్యమైన విద్యాబోధన చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఉచితంగా అకడమిక్ పుస్తకాలు, విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందిస్తున్నాం. స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు నుంచి మధ్యాహ్న భోజనం అందుబాటులో ఉంటుంది.

– డాక్టర్ కుతుంబాక శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్

ప్రైవేట్‌కు దీటుగా విద్య..



మా కళాశాలలో విద్యాబోధన మంచిగా ఉంటుంది. క్రమ శిక్షణతో కూడిన విద్యను అధ్యాపకులు అందిస్తున్నారు. నేను ఇంటర్ సెకండ్ ఇయర్ బైపీసీ చదువుతున్నారు. మొదటి సంవత్సరంలో 424/440 మార్కులు వచ్చాయి. కళాశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ప్రైవేట్ కళాశాలకు దీటుగా విద్యను అందిస్తున్నారు.

– ఎనుముల నాగమల్లేశ్వరి, విద్యార్థిని, కల్లూరు

జీరో బ్యాలెన్స్ ఖాతాలను పునరుద్ధరించుకోవాలి

తల్లాడ: ప్రధానమంత్రి జన్ ధన్ యోజన కింద ఇచ్చిన జీరో బ్యాలెన్స్ ఖాతాలను పునరుద్ధరించుకోవాలని ఆర్బీఐ ఎల్‌డీఓ చేతన్ గోరేకర్ సూచించారు. బుధవారం తల్లాడ మండలం అంబేద్కర్ నగర్‌లో జరిగిన జన సురక్ష అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఖాతా తెరచి జన సురక్ష ఇన్సూరెన్స్ తీసుకోవాలన్నారు. డిజిటల్ లావాదేవీలు, సైబర్ క్రైమ్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఖమ్మం ఎల్‌డీఎం ఎ.రవిప్రసాద్, తల్లాడ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఫణికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతన్న ఎల్‌డీఓ చేతన్ గోరేకర్

స్పెషలాఫీసర్ల పాలనలో గ్రామాలు అంధకారం

కొణిజర్ల: స్పెషలాఫీసర్ల పాలనలో గ్రామాలు అంధకారంలో ఉంటున్నాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి కృష్ణ పేర్కొన్నారు. బుధవారం ఆ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో సర్వే నిర్వహించి పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రసాద్, కనకయ్య, హరిచంద్, ఉమ, రాణి, సీతమ్మ, సాలి, యాలాద్రి తదితరులు పాల్గొన్నారు.

రేపు గిరిజన సంఘం ఉమ్మడి జిల్లా సమావేశం

వైరా: తెలంగాణ గిరిజన సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం వైరా పట్టణంలో నిర్వహిస్తున్నట్లు ఈ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బానోత్ బాలాజీ, భూక్యా వీరభద్రం తెలిపారు. బుధవారం వైరాలో వారు మాట్లాడుతూ.. గిరిజన సమస్యలు, విద్యా, వైద్యం, పోడుభూముల సమస్యలు, తండాలను గ్రామాలుగా గుర్తించాలని ఖమ్మం జిల్లాలో గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు, తదితర సమస్యల పై ప్రత్యేక కార్యాచరణ రూపొందించబోతున్నట్లు తెలిపారు. గిరిజనులు పెద్ద ఎత్తున హాజరై సదస్సును జయప్రదం చేయాలన్నారు.

వంట పాత్రలు పంపిణీ

తల్లాడ: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు బుధవారం ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్ మధ్యాహ్న భోజన వంట పాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, తనీషా, శివ పాల్గొన్నారు.

ఎల్లవేళలా పేదల పక్షాన ‘సీపీఐ’

పెనుబల్లి : బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం పనిచేసే పార్టీ ‘సీపీఐ’యే నని ఆ పార్టీ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు అన్నారు. బుధవారం మండలంలోని గట్టుగూడెంలో నిర్వహించిన ఆ పార్టీ 9వ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పీఏసీఎస్ డైరెక్టర్ జోగయ్య, నాయకులు నరసింహారావు, ఆదినారా యణ, సీతామాలక్ష్మి, సుధాకర్, భాస్కర్, యోబు పాల్గొన్నారు.

సాగునీటిని విడుదల చేయాలి

తల్లాడ: మండలంలోని సిరిపురం మేజరకు సాగునీటిని విడుదల చేయాలని సీపీఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, రైతు సంఘం మండల కార్యదర్శి మోహన్‌రావు అన్నారు. తల్లాడ సీపీఎం కార్యాలయంలో బుధవారం రైతు సంఘం మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. సీతారామప్రాజెక్ట్ నీళ్లు ఏన్కూరు వరకు వస్తున్నాయని, దాని పక్కనే సిరిపురం మేజరుకు మాత్రం నీటిని

టీబీ రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యం

ఏన్కూరు: టీబీ రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ వైద్యాధికారి బి.రాములు తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పరిధిలోని టీబీ వ్యాధిగ్రస్తులకు యలమద్ది ఆస్పత్రి సహకారంతో న్యూట్రిషన్ కిట్లను వైద్యాధికారి రాములు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీబీ వ్యాధి లక్షణాలున్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీబీ నోడల్ అధికారి పద్మ, హెచ్‌వీ పుష్పారాణి, టీబీ సీనియర్ సూపర్‌వైజర్ సురేష్, ఫార్మసిస్ట్ నీరజ, ల్యాబ్‌టెక్నిషియన్ రమణ, హెల్త్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



న్యూట్రిషన్ కిట్లను అందిస్తున్న దృశ్యం


సీపీఐ జిల్లా మహాసభలకు ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పార్టీ శ్రేణులు

మధిర: ఈ నెల 19,20 తేదీల్లో మధిర పట్టణం రెడ్డి గార్డెన్‌లో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ)ఖమ్మం జిల్లా 23వ మహాసభలకు మధిర పట్టణం ముస్తాబైంది. పార్టీ జిల్లా మహాసభల్లో భాగంగా సభను జయప్రదం చేయాలని బుధవారం పార్టీ శ్రేణులు మధిర పరిధిలోని ఆత్కూరు రింగ్ సర్కిల్ ఏరియా నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు జెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలతో ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బెజవాడ రవిబాబు, బోనకల్ మండల కార్యదర్శి ఆనందరావు, నాయకులు రహీం, రమేష్, బ్రహ్మం, సత్యనారాయణ, నాగకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇందిరా మహిళా శక్తి సంబరాలు



వైరా జూనియర్ కళాశాల స్థలాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ సన్యాసయ్య

వైరా: తెలంగాణా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి సంబరాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఆర్.సన్యాసయ్య అన్నారు. ఈ నెల 18న వైరాలో ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో బుధవారం ఆయన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో వేదిక ఏర్పాటు కు కావాల్సిన ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం స్థానిక గిరిజన భవన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ ఆర్.జయశ్రీ, డీపీఎంలు ఆంజనేయులు, రాజేష్, వైరా ఎంపీడీఓ సరస్వతి, వివిధ మండలాల ఏపీఎంలు వెంకటేశ్వర్లు, పుల్లారావు, వెంకటేశ్వరరావు, వెంకట రామారావు పాల్గొన్నారు.

25 నుంచి అన్నదానం

మధిర: మధిర పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈనెల 25న శ్రావణమాసం శుక్రవారం నుంచి ప్రతీ శుక్రవారం పేదలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కపిలవాయి జగన్మోహన్ రావు తెలిపారు. ఆలయం వద్ద దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిరంతరాయంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. అన్నదాన కమిటీలో పబ్బతి రమేష్, కపిలవాయి జగన్ మోహన్ రావు, పల్లపోతు ప్రసాదరావు(9440197581), కుంచం కృష్ణారావు సభ్యులుగా ఉన్నారని తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఆర్థిక సాయం

తల్లాడ: మండలంలోని బస్వాపురం గ్రామానికి చెందిన ఆశ వర్కర్ మోదుగు సులోచన ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కళావతి భాయి సమక్షంలో ఖమ్మంలో కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోషియేషన్ అధ్యక్షులు శ్రవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారి రత్న మనోహర్, కమల, రవితేజ, నవీన్, నాగరాజు, కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

రూ.26 వేల వేతనం ఇవ్వాలి



నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

ఏన్కూరు: అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని అంగన్‌వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి రమ్య కోరారు. బుధవారం మండలంలోని రాజలింగాలలో నిర్వహించిన అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మాపై నిరంకుశంగా వ్యవహరిస్తుందని, ఒకటిన పడాల్సిన జీతాలు 15రోజులు దాటినా వేయడం లేదన్నారు. అనంతరం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు కె.సుధారాణి, సీఐటీయూ మండల కార్యదర్శి ఏర్పుల రాములు, అంగన్‌వాడీ వర్కర్లు బద్రకాళి, రత్నకుమారి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడు మృతి

వైరా: వైరా పట్టణంలోని బోడేపూడి కాలనీకి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు నంద్రు పద్మారావు మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం తుది వరకు కట్టుబడి ఉన్న నాయకుడు పద్మారావు అని పలువురు పెద్దలు కొనియాడారు. పద్మారావు మృతదేహాన్ని సీపీఎం జిల్లా నాయకులు బొంతు రాంబాబు, సుంకర సుధాకర్, దేవేంద్ర, సదానందం, మనోహర్, చలపతిరావు, శ్రీనివాసరావు, కుటుంబరావు, మచ్చా మణి , సుధాకర్, కృష్ణారావు తదితరులు సందర్శించి ఎర్రా జెండా కప్పి నివాళులు అర్పించారు.

పామాయిల్ సాగుకు సబ్సిడీ

మధిర: పామాయిల్ సాగు చేసే రైతులు ప్రభుత్వం నుంచి సబ్సిడీ పొందవచ్చునని వ్యవసాయ విస్తరణ అధికారి జిష్ణు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం కోసం ప్రభుత్వం సబ్సిడీ ద్వారా మొక్కలు, ఎరువులు, డ్రిప్, అంతరపంట సాగుకు అవసరమైన సహాయాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగుచేసిన 4 సంవత్సరాల కాలంలో ఎకరానికి రూ.50,918 రాయితీ పొందవచ్చునని సూచించారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శాకాంబరీదేవిగా కారేపల్లి పెద్దమ్మతల్లి

కారేపల్లి: శాకాంబరీదేవిగా కారేపల్లి పెద్దమ్మతల్లి భక్తులకు బుధవారం దర్శనమిచ్చింది. రకరకాల కూరగాయలతో అమ్మవారిని భక్తులు అలంకరించారు. ఆలయ అర్చకులు మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.ఆలయ కమిటీ చైర్మన్ తురక నారాయణ, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వరినాట్లు వేసిన విద్యార్థులు

తల్లాడ: స్థానిక బాలభారతి విద్యాలయం విద్యార్థులు బుధవారం తమ పాఠ్యాంశానికి అనుగుణంగా వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. వరిపొలంలో బురదలో దిగి వరినాట్లు వేశారు. ఈ సందర్భంగా వరి పండించే విధానాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మిషన్ భగీరథ ప్రాజెక్ట్‌ను సందర్శించి నీటి పంపిణీ విధానం, నీటి శుద్ధీకరణ గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఓ ఎండీ.తాజుద్దీన్, కేఎస్ఎం విద్యా సంస్థల కరస్పాండెంట్ ప్రవీణ్, డైరెక్టర్ శ్రావణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును కమ్మేస్తున్న ఇసుక



వేంసూరులో రోడ్డుపై చేరిన ఇసుక

వేంసూరు: సత్తుపల్లి – విజయవాడ ప్రధాన రహదారి వేంసూరు నుంచి వెంకటాపురం వరకు దాదాపు 10మీటర్ల వెడల్పు ఉన్న రహదారిపై రోడ్డుకు ఇరు పక్కల 4మీటర్లు ఇసుక మేట వేసింది. అనేక చోట్ల 2మీటర్లు మేర పచ్చిగడ్డి రోడ్డును కమ్మేసింది. రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఇసుక కారణంగా ద్విచక్ర వాహనలు ప్రమాదలకు గురవుతున్నారు. ఇప్పటికైన ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుపై చేరిన ఇసుక తొలగించాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం ఫీడర్లో మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తల్లాడ విద్యుత్ శాఖాధికారి రాయల ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నారుగూడెం, గోపాలపేట, నరసింహారావుపేట, లక్ష్మీనగర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యుత్ మోటార్ చోరీ

ముదిగొండ: ముదిగొండకు చెందిన శ్రీనివాసరావుకు సువర్ణాపురం రెవెన్యూపరిధిలోని వ్యవసాయ బావి ఉంది. దానిపై విద్యుత్ త్రీహెచ్‌పీ విద్యుత్ మోటార్‌ను బిగించారు. బుధవారం ఉదయం బావి వద్దకు వెళ్లి చూడగా విద్యుత్ మోటార్ చోరీకి గురైందని గుర్తించి, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విద్యుత్ మోటార్ విలువ రూ.25వేలు ఉంటుందని రైతు తెలిపాడు.

బీమా నగదు అందజేత



నగదు అందిస్తున్న మేనేజర్, చైర్మన్

ఎర్రుపాలెం: మండలంలోని పెద్ద గోపవరం సొసైటీలోని రైతు అన్నెం రాంబాబు ఇటీవల మృతి చెందాడు. ఈయన పేరిట సొసైటీలో గ్రూప్ ఇన్సూరెన్స్ ఉంది. రైతు మృతి చెందడంతో ఆయన పేరిట రూ.50వేల బీమా మంజూరైంది. కాగా ఈ నగదును బుధవారం మండలకేంద్రంలోని డీసీసీబీ కార్యాలయంలో మృతుని సతీమణి, నామినీ రమ్యకు బ్యాంక్ మేనేజర్ దివ్య, సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుధాకర్, సీఈఓ వీరారెడ్డి తదితరులున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

ఏన్కూరు: రైతులు పొలాల్లో విద్యుత్‌షాక్ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తల్లాడ ఏడీఈ సతీష్ తెలిపారు. మండలంలోని కేసుపల్లి రైతులకు ఎర్త్ డిచార్జ్ రాడ్స్, హెల్మెంట్లను బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఉమాకాంత్, ఎల్ఐ రమేష్ పాల్గొన్నారు.